PRGI Reg No. TGTEL/25/A0555
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | సంపుటి : 01 | సంచిక :155 | పేజీలు : 8 | వెల రూ.5 | ఆదివారం. 21.06.2026
ఎడిటర్ : చెరుకు ఉపేందర్
Published From Rangareddy
Circulated by All Districts of Telangana and Andhra Pradesh

WANTED
ప్రభాత సూర్యుడు
www.prabhathasuryudu.com
రిపోర్టర్స్ కావలెను
తెలుగు పత్రికారంగ చరిత్రలో ఒక కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టి సమకాలీన అంశాలను సంక్షిప్తంగా అందిస్తూ... ప్రజాధరణ పొందుతున్న ప్రభాత సూర్యుడు జాతీయ దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా ఇన్‌ఛార్జీలు, నియోజకవర్గాలు, మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను.
కనీస విద్యార్హత, సమకాలీన సమస్యలపై అవగాహన.. తెలుగు భాషపై ప్రావీణ్యం కలిగిన అభ్యర్థులు సంప్రదించగలరు. అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
prabhathasuryudueditor@gmail.com
https://youtube.com/@PrabhathaSuryuduNews
70326 93467
WANTED REPORTERS

### రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినం రోజున

## ఒడిశాలో భారీగా అభివృద్ధి ప్రాజెక్టులు



మయూర్‌భంజ్(ఒడిశా), ప్రభాత సూర్యుడురాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఒడిశాలోని మయూర్‌భంజ్‌లో జరిగిన 'వికాస్ రా ధారా, ఒడిశా సారా' బహిరంగ సభలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒడిశా సర్వతోముఖాభివృద్ధి కోసం దాదాపు రూ.47,000 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినం రోజే ఈ కార్యక్రమం జరగడం విశేషం.

**పహాడ్‌పూర్‌ను 'సోలార్ విలేజ్'గా ప్రకటన**

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జన్మదినం సందర్భంగా ఆమె స్వగ్రామమైన పహాడ్‌పూర్‌ను ప్రధాని మోదీ సందర్శించారు. ఈ గ్రామాన్ని వేగంగా అభివృద్ధి చేసి 'సోలార్ విలేజ్'గా మారుస్తామని ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామంలోని ప్రతి ఇంటికీ సౌరశక్తి అందుతుంది. ఒడిశాలోని ప్రసిద్ధ కోణార్క్ సూర్య దేవాలయానికి ఉన్న గుర్తింపు తరహాలోనే, పహాడ్‌పూర్ గ్రామం కూడా ప్రపంచవటంలో పునరుత్పాదక ఇంధన కేంద్రంగా సరికొత్త గుర్తింపును పొందుతుందని ప్రధాని పేర్కొన్నారు.

**పారిశ్రామిక ప్రగతి, 'ఉత్కర్ష్ ఒడిశా'**

ఒడిశాలోని సహజ వనరులను ఆర్థిక అవకాశాలుగా మార్చడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ప్రధాని తెలిపారు. రాష్ట్రంలో భారీగా పారిశ్రామిక వృద్ధి జరుగుతోందని, అంతర్జాతీయ, దేశీయ పెట్టుబడిదారులను ఆకర్షించడంలో 'ఉత్కర్ష్ ఒడిశా' ప్రచారం కీలక పాత్ర పోషిస్తోందని ఆయన కొనియాడారు. కొత్త పరిశ్రమల స్థాపన ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గిరిజన యువతకు మెరుగైన విద్య, ఉపాధి అవకాశాలను అందించడం ద్వారా వారిని సాధికారత వైపు నడిపించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మోదీ పునరుద్ఘాటించారు. గిరిజన పిల్లలకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించేందుకు దేశవ్యాప్తంగా సుమారు 500 ఏకలవ్య మోడల్ స్కూళ్లను ప్రారంభించామని తెలిపారు.

**సంస్కృతి, సంప్రదాయాలకు గౌరవం**

అంతకుముందు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ కలిసి పహాడ్‌పూర్ గ్రామంలోని 'సంతాలీ జాహిరా', 'హో జాహిరా' అనే పవిత్ర వనాలలో సంప్రదాయ పూజలు, ఆచారాలు నిర్వహించి దేశ శ్రేయస్సు కోసం ప్రార్థించారు. ప్రస్తుతం ఒడిశాలో పండుగ వాతావరణం నెలకొందని, గత వారమే 'గాన్ పర్దా' పండుగను ఘనంగా జరుపుకున్నారని, అలాగే జగన్నాథ రథయాత్ర, బరిపద రథయాత్ర ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని ఈ సందర్భంగా ప్రధాని గుర్తుచేశారు. ఈ ఉత్సవాల మధ్య 'ప్రజాస్వామ్యం, అభివృద్ధి' అనే పండుగ కూడా ఇక్కడ నడుస్తోందని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

## వీబీజీ రామ్‌జీ చట్టంపై కేంద్రానికి మంత్రి సీతక్క లేఖ



హైదరాబాద్, జూన్ 20, ప్రభాత సూర్యుడువీబీజీ రామ్‌జీ చట్టాన్ని వ్యతిరేకిస్తూ కేంద్ర ప్రభుత్వానికి నిరసన లేఖ రాశామని మంత్రి సీతక్క పేర్కొన్నారు. నూతన చట్టాన్ని ఉపసంహరించాలని కేంద్రాన్ని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. నూతన చట్టంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ మూడు వేర్వేరు లేఖలు కేంద్రానికి పంపించామని వెల్లడించారు. శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మీడియాతో మంత్రి సీతక్క మాట్లాడారు. ఎంజీఎన్ఆర్ఈజీఎన్‌ను యథాతథంగా కొనసాగించి గ్రామీణ పేదల ఉపాధి హక్కును కేంద్రం కాపాడాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీల అధికారాలను బలహీనపరిచే నిబంధనలని వెంటనే సవరించాలని విజ్ఞప్తి చేశారు. వీబీజీ రామ్‌జీ నిధుల కేటాయింపు విధానం పేదలు, దళితులు, గిరిజనులకు అన్యాయం చేస్తోందని పేర్కొన్నారు.

**పనిదినాల ఆధారంగానే నిధుల కేటాయింపు జరగాలి..**

రాష్ట్రాన్ని ఒకే యూనిట్‌గా చూడకుండా గ్రామస్థాయి ఉపాధి అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని మంత్రి సీతక్క సూచించారు. ఆదిలాబాద్, ములుగు, కుమురంభీం, ఆసిఫాబాద్ వంటి వెనుకబడ్డ ప్రాంతాల అవసరాలు విస్మరించొద్దని అన్నారు. గ్రామ పంచాయతీల్లో నమోదైన వాస్తవ పనిదినాల ఆధారంగానే నిధుల కేటాయింపు జరగాలని సూచించారు. నిధుల పంపిణీ విషయంలో కేంద్రం ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవద్దని చెప్పుకొచ్చారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని వీబీజీ రామ్‌జీ పరిధిలో అనుమతించాలని కోరారు. గృహ నిర్మాణ లబ్ధిదారులకు గతంలోలాగే 90 రోజుల ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. వ్యక్తిగత భూ అభివృద్ధి పనులను తొలగిస్తే చిన్న రైతులకు నష్టమని చెప్పారు.

**జీవనోపాధి పనులను కొనసాగించాలి..**

ఎస్సీ, ఎస్టీ, చిన్న సన్నకారు రైతులకు ఉపయోగపడే జీవనోపాధి పనులను కొనసాగించాలని మంత్రి సీతక్క సూచించారు. వరదలతో దెబ్బతిన్న భూముల పునరుద్ధరణ, న్యూట్రి గార్డెన్లు, వెదురు తోటలకు అనుమతి ఇవ్వాలని కోరారు.

## రైతుల ఖాతాల్లోకి రూ.2 వేలు చొప్పున పీఎం కిసాన్ డబ్బులు జమ



కోల్‌కతా/తారకేశ్వర్, జూన్ 20ప్రభాత సూర్యుడు పీఎం కిసాన్ డబ్బులు విడుదలయ్యాయి. ప్రధాని మోదీ 23వ విడత నిధులను విడుదల చేశారు. ఈ విడత ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న 9.44 కోట్ల మందికి పైగా అర్హులైన రైతుల బ్యాంకు ఖాతాల్లోకి రూ. 2,000 చొప్పున మొత్తం రూ. 18,880 కోట్లు నేరుగా జమయ్యాయి. ఈ విడతలో దేశవ్యాప్తంగా సుమారు 2.18 కోట్ల మంది మహిళా రైతులు లబ్ధి పొందడం విశేషం. 2019 ఫిబ్రవరిలో ప్రారంభమైన ఈ పథకం ద్వారా ఇప్పటివరకు రైతులకు అందిన మొత్తం సాయం రూ. 4.46 లక్షల కోట్లు దాటింది. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లా తారకేశ్వర్ నుంచి ఇవాళ ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిష్టాత్మక పీఎం కిసాన్ యోజన 23వ విడత నిధులను విడుదల చేశారు. ఈ నిధుల విడుదలతో పాటు, పశ్చిమ బెంగాల్ వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రధాని మోదీ పలు కీలక పథకాలను, డిజిటల్ విప్లవాన్ని ప్రారంభించారు.





## మెడికల్ బోర్డు కోసం పోరాటమే!

- ప్రభుత్వం, యాజమాన్యానికి నెల రోజుల గడువు
- కార్మిక హక్కుల కోసం దీక్షకు టీఆర్ఎస్ సిద్ధం
- 5 ఇంక్లైన్ గేట్ మీటింగ్‌లో కల్వకుంట్ల కవిత

ప్రభాత సూర్యుడు

గని గర్భంలో చెమట చిందించిన కార్మికుడి ఆరోగ్యమే సంపద... ఆ సంపదను కాపాడే మెడికల్ బోర్డులే లేకుంటే పోరాటమే మార్గం" అంటూ తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల ప్రభుత్వానికి, సింగరేణి యాజమాన్యానికి గట్టి హెచ్చరిక జారీ చేశారు. భూపాలపల్లి కాకతీయ ఖని5 గని పై శనివారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మికులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్న ఆయన, పెండింగ్‌లో ఉన్న మెడికల్ బోర్డుల నిర్వహణపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణి కార్మికుల ఆరోగ్య పరీక్షల కోసం మెడికల్ బోర్డులను వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వం, యాజమాన్యానికి నెల రోజుల గడువు ఇస్తున్నట్లు ప్రకటించారు. జూలై 20లోగా మెడికల్ బోర్డుల నిర్వహణపై స్పష్టమైన షెడ్యూల్ ప్రకటించకపోతే అదే రోజు గాంధేయ మార్గంలో నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభిస్తానని హెచ్చరించారు. ప్రస్తుతం సుమారు 1,200 మంది కార్మికులు మెడికల్ బోర్డు పరీక్షల కోసం ఎదురు చూస్తున్నారని, వారి ఆరోగ్య పరిస్థితులు, ఉద్యోగ భద్రతకు సంబంధించిన అంశాలు పెండింగ్‌లో ఉండటం ఆందోళనకరమని అన్నారు. నెలకు కనీసం రెండు మెడికల్ బోర్డులు నిర్వహించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గతంలో ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో 750 మంది ఇళ్లను కూల్చివేస్తామని ప్రకటించగా తాము చేపట్టిన నిరాహార దీక్ష ఫలితంగానే 450 మందికి ఇళ్ల పట్టాలు అందాయని గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో సింగరేణి కార్మికుల హక్కుల కోసం కూడా ఉద్యమం చేస్తామని స్పష్టం చేశారు. కార్మికుల ఆరోగ్యం, సంక్షేమం విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరిస్తూ, మెడికల్ బోర్డుల నిర్వహణపై వెంటనే నిర్ణయం తీసుకోవాలని కల్వకుంట్ల డిమాండ్ చేశారు. గేట్ మీటింగ్‌లో పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొని తమ సమస్యలను నాయకత్వం దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి, జయ శంకర్ విగ్రహానికి పూలమాల వేసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎచ్ ఏం ఎస్ నాయకులు , కార్మికులు పాల్గొన్నారు

### షిండే నేతృత్వంలోనిదే

## అసలైన శివసేన..

### అమిత్ షా సంచలన వ్యాఖ్యలు



కొల్హాపూర్, జూన్ 20ప్రభాత సూర్యుడుమహారాష్ట్ర రాజకీయాల్లో మరోసారి పెను తుఫాను చెలరేగింది. శివసేన(ఉద్ధవ్ బాలాసాహెబ్ ఠాక్రే) పార్టీలో తీవ్ర తిరుగుబాటు వ్యూహాలు నడుస్తున్నాయనే వార్తల నడుమ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా శనివారం చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర సంచలనం సృష్టిస్తున్నాయి. శివసేనలో ఇక ఎలాంటి గ్రూపులు లేవని, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏకనాథ్ షిండే నేతృత్వంలో నడుస్తున్నదే ఏకైక అసలైన శివసేన అని ఆయన స్పష్టం చేశారు. కొల్హాపూర్‌లో జరిగిన బహిరంగ సభలో అమిత్ షా ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.


**షిండే గ్రూప్' అనాల్సిన అవసరం లేదు**

సభను ఉద్దేశించి అమిత్ షా మాట్లాడుతూ.. 'గతంలో మనం ఏకనాథ్ షిండే పేరును ప్రస్తావిస్తూ 'శివసేన షిండే గ్రూప్' అని పిలవాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు రాష్ట్రంలో ఎలాంటి గ్రూపులు లేవు. ఒకే ఒక్క శివసేన ఉంది. అది షిండే నేతృత్వంలోనిదే' అని ప్రకటించారు.

అంతకుముందు కొల్హాపూర్‌లోని ప్రముఖ మాతా అంబాబాయి ఆలయాన్ని సందర్శించిన అమిత్ షా.. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహారాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టబోయే ఆలయ ఆధునీకీకరణ, కారిడార్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చిన 'వికాస్ భీ, విరాసత్ భీ(అభివృద్ధి, వారసత్వం)' అనే సంకల్పంతోనే దేశంలో సాంస్కృతిక పునరుజ్జీవనం జరుగుతోందని, మహారాష్ట్రలోని అన్ని జ్యోతిర్లింగాలు, శక్తి పీఠాలను ప్రభుత్వం పునరుద్ధరిస్తోందని అమిత్ షా ఈ సందర్భంగా చెప్పారు.

# ఫారెస్ట్--రెవెన్యూ జాయింట్ సర్వే, భూసేకరణ ప్రక్రియలను వేగవంతం చేయాలి!

## గుమ్మడిదల మండలం అభివృద్ధి పనులకు రూ.16 లక్షలు



జూన్( 20) ప్రభాత సూర్యుడు సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండల పరిధిలో ఉపాధి హామీ పథకం కింద రూ.16 లక్షల వ్యయంతో చేపట్టే రెండు అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ ప్రతిపదుల అనుమతులు మంజూరు చేశారు. ఇందులో భాగంగా రాంరెడ్డి భాయి గ్రామంలో సిసి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం కోసం ఆరు లక్షలు, నగరం గ్రామపంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీలో అంతర్గత సిసి రోడ్ పనుల కోసం పది లక్షల రూపాయలు కేటాయించారు.

## సంగారెడ్డి జిల్లా ప్రత్యేక అధికారిగా క్రిస్టీనా జెడ్ చోంగ్తు



జూన్ (20)ప్రభాత సూర్యుడుసంగారెడ్డి జిల్లా లో నిర్వహించిన ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమ ఫలితాల క్షేత్రస్థాయి సమీక్ష కోసం జిల్లా ప్రత్యేక అధికారిగా ఐఏఎస్ అధికారిని డాక్టర్ క్రిస్టనా జెడ్ చోంఘ్టు( ప్రిన్సిపల్ సెక్రెటరీ హెచ్ఎమ్ ఎండ్ ఎఫ్ డబ్ల్యూ )గా నియమితులయ్యారు ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్లానింగ్ విభాగం ఉత్తర్వులు జారీ చేసింది.ఆమె జిల్లాలో పర్యటించి ప్రగతి పై సమీక్ష నిర్వహించుచున్నారు.

## కేజీబీవీలో సిఓఈ కోచింగ్

ప్రభాత సూర్యుడు సంగారెడ్డి జిల్లాలోని మూడు కేజీబీవీ కళాశాలలో సెంటర్



ఆఫ్ ఎక్సలెన్స్( సిఓఈ) అమలు చేస్తున్నట్లు జిసిడిఓ సునీత శనివారం నాడు తెలిపారు. జిన్నారంలో నీట్, సదాశివపేటలో ఐఐటి, అందోల్ లో క్లాట్ కోచింగ్ ప్రత్యేకంగా అందిస్తున్నామని చెప్పారు! ఇటీవల అందోల్ కేజీబీవీ విద్యార్థులు లాసెట్ లో ఎంపికై ప్రతిభ చాటినట్లు ఆమె పేర్కొన్నారు.

## ఉద్యమకారుడు మలికంటి శంకర్ కుటుంబానికి బీఆర్ఎస్ నేతల అండ

**దశదినకర్మలకు హాజరై రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేత**

ములుగు, జూన్ 20 ప్రభాత సూర్యుడుములుగు జిల్లా మంగపేట మండలానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు మలికంటి శంకర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, శుక్రవారం ఆయన స్వగృహంలో నిర్వహించిన దశదినకర్మలకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు హాజరై నివాళులర్పించారు.



శంకర్ కుటుంబ సభ్యులను పరామర్శించి, పార్టీ తరఫున రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మంగపేట మండల మాజీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ కుదుముల లక్ష్మీనాయక్, జిల్లా సీనియర్ నాయకులు వత్సవాయి శ్రీధర్ వర్మ, తుమ్మ మల్లారెడ్డి, యడ్లపల్లి నర్సింహారావు, చిలకమర్రి రాజేందర్, కర్రీ శ్యాంబాబు, గుండేటి రాజు యాదవ్, నూతిలకంటి ముకుందం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మలికంటి శంకర్ ఉద్యమ కాలం నుంచి పార్టీ అభివృద్ధికి విశేష సేవలు అందించారని, ఆయన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

### అధికారులను నిలదీసిన జిల్లా కలెక్టర్ అంకిత్: "సమస్యల పరిష్కారంలో జాప్యమెందుకు" అక్కినేపల్లి, లింగంపల్లి ప్రాంతాల్లో నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశం





దమ్మపేట, జూన్ 21 ప్రభాత సూర్యుడుజిల్లాలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఫారెస్ట్--రెవెన్యూ జాయింట్ సర్వే, నాన్-క్యాడస్ట్రల్ సర్వే మరియు నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ ప్రక్రియలను యుద్ధప్రాతిపదికన వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను తీవ్రంగా ఆదేశించారు. శనివారం దమ్మపేట మండలంలోని పలు అటవీ, రెవెన్యూ సరిహద్దు ప్రాంతాల్లో కొనసాగుతున్న సర్వే పనులను ఆయన క్షేత్రస్థాయిలో అకస్మాత్తుగా పరిశీలించారు. పనుల పురోగతిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, క్షేత్రస్థాయిలోనే అధికారులను నిలదీశారు.అధికారులపై ప్రశ్నల వర్షం.. పారదర్శకతకే మొదటి ప్రాధాన్యం!దమ్మపేట మండలం అక్కినేపల్లి గ్రామంలో జరుగుతున్న నాన్-క్యాడస్ట్రల్ సర్వే పనులను పరిశీలించిన కలెక్టర్, అధికారుల పనితీరుపై ప్రశ్నలు గుప్పించారు."సర్వే ప్రక్రియలో ఎందుకు ఆలస్యమవుతోంది''''భూముల హద్దుల గుర్తింపు, రికార్డుల నమోదులో ఖచ్చితత్వం ఏది" అని అధికారులను ప్రశ్నించారు.నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే సహించేది లేదని హెచ్చరిస్తూ, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, అత్యంత పారదర్శకంగా సర్వే నిర్వహించి భూవివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలని అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు.సరిహద్దు వివాదాలకు స్వస్తి పలకాలి: లింగంపల్లిలో పరిశీలనఅనంతరం దమ్మపేట మండలం లింగంపల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 1458లో కొనసాగుతున్న ఫారెస్ట్--రెవెన్యూ జాయింట్ సర్వే పనులను కలెక్టర్ పరిశీలించారు. అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ సర్వేలో ఖచ్చితత్వం లోపించకూడదని స్పష్టం చేశారు. "రెండు శాఖల మధ్య సమన్వయ లోపం వల్ల రైతులు నష్టపోకూడదు" అని పేర్కొంటూ, వివాద రహితంగా సరిహద్దుల నిర్ధారణ చేయాలని సూచించారు.మరో రెండు నెలల్లో పూర్తి చేస్తాం: అధికారులుకలెక్టర్ ప్రశ్నించిన తీరుకు స్పందించిన అధికారులు.. అక్కినేపల్లి గ్రామ పరిధిలో సుమారు 4,400 ఎకరాల విస్తీర్ణంలో ఫారెస్ట్--రెవెన్యూ జాయింట్ సర్వే పనులు ప్రణాళికాబద్ధంగా సాగుతున్నాయని వివరించారు. రాబోయే రెండు నెలల గడువులోగా ఈ ఉమ్మడి సర్వే ప్రక్రియను పూర్తిగా పూర్తి చేసి నివేదిక అందిస్తామని కలెక్టర్‌కు హామీ ఇచ్చారు.సీతారామ ప్రాజెక్టు భూసేకరణపై సమీక్షఅనంతరం దమ్మపేట తహసీల్దార్ కార్యాలయంలో నీటిపారుదల శాఖ అధికారులతో కలెక్టర్ అత్యవసర సమావేశం నిర్వహించారు. సీతారామ ప్రాజెక్టు అలైన్‌మెంట్‌ను మ్యాప్ ద్వారా క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన, ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ, సర్వే, సరిహద్దుల నిర్ధారణ అంశాలపై సమీక్షించారు. ప్రభుత్వ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు పనులకు ఎటువంటి అవరోధాలు తలెత్తకుండా పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని, నిర్దేశిత గడువులోగా లక్ష్యాలను సాధించాలని స్పష్టం చేశారు.ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో కలెక్టర్ వెంట కొత్తగూడెం రెవెన్యూ డివిజనల్ అధికారి (=ఋా) మధు, దమ్మపేట తహసీల్దార్ రామ్ నరేష్, ఫారెస్ట్ రేంజర్ శ్రీనివాస్ రావు, సర్వేయర్ నాగరాజు మరియు స్థానిక రైతులు, తదితరులు పాల్గొన్నారు

## నాలను కబ్జా చేసి విల్లాల నిర్మాణం..!

**- ఏఎంఆర్ లెగసీ రియల్ సంస్థకు ఇరిగేషన్ శాఖ హెచ్చరిక**
**- పత్రాలు చూపడంలో విఫలమైన యాజమాన్యం**
**- వెంటనే నిర్మాణాలు నిలిపివేయాలని ఆదేశం**

అబ్దుల్లాపూర్‌మెట్ -- ప్రభాత సూర్యుడురంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని గౌరెల్లి గ్రామంలో ఏఎంఆర్ లెగసీ రియల్ సంస్థ నాలను కబ్జా చేసి నిబంధనలకు విరుద్ధంగా విల్లాల నిర్మాణాలు చేపడుతోందన్న గ్రామస్థుల ఫిర్యాదుతో ఇరిగేషన్ శాఖ అధికారులు రంగంలోకి దిగారు. శనివారం అబ్దుల్లాపూర్‌మెట్ మండల ఇరిగేషన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ) శ్రీవాణి నాలను పరిశీలించారు. పరిశీలన అనంతరం ఏఈఈ శ్రీవాణి మాట్లాడుతూ..ఏఎంఆర్ లెగసీ రియల్ సంస్థ చేపట్టిన నిర్మాణాల్లో నాలా ఆక్రమణ జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు తెలిపారు. ఆక్రమణకు సంబంధించి అవసరమైన పత్రాలను సమర్పించాలని యాజమాన్యాన్ని కోరగా, వారు ఎలాంటి ధ్రువపత్రాలు చూపించలేకపోయారని పేర్కొన్నారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన ఏఈఈ శ్రీవాణి, వెంటనే జరుగుతున్న నిర్మాణ పనులను నిలిపివేయాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా నాలాను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినట్లు తేలితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.అదేవిధంగా సంస్థకు త్వరలోనే నోటీసులు జారీ చేసి, పూర్తి స్థాయి విచారణ చేపడతామని ఏఈఈ శ్రీవాణి తెలిపారు. ప్రజల ఫిర్యాదుల మేరకు ప్రభుత్వ ఆస్తులు, జలమార్గాల పరిరక్షణ కోసం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారగా, నాలాలు మరియు ప్రభుత్వ భూములపై జరుగుతున్న ఆక్రమణలపై అధికారులు మరింత కఠినంగా వ్యవహరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.





## రెవెన్యూ అధికారులపై దాడి దుర్మార్గం

**బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి: ట్రెసా డిమాండ్**

రంగారెడ్డి జిల్లా, జూన్ 20 (ప్రభాత సూర్యుడు): అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో విధులు నిర్వహిస్తున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, గ్రామ పరిపాలన అధికారి (జీపీఓ)పై ఇటీవల జరిగిన దాడిని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) రంగారెడ్డి జిల్లా శాఖ తీవ్రంగా ఖండించింది. ప్రభుత్వ విధులను నిర్వర్తిస్తున్న అధికారులపై దాడులు జరగడం ఆందోళనకరమని, ఇటువంటి ఘటనలు ప్రభుత్వ ఉద్యోగుల భద్రతకు ముప్పుగా మారడంతో పాటు పరిపాలనా వ్యవస్థకు ఆటంకం కలిగిస్తాయని సంఘం పేర్కొంది.ఈ సందర్భంగా ట్రెసా నాయకులు మాట్లాడుతూ, ప్రజలకు సేవలందించే క్రమంలో విధులు నిర్వహిస్తున్న రెవెన్యూ సిబ్బందిపై దాడులు జరగడం సహించరానిదని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు నిర్భయంగా విధులు నిర్వహించేలా ప్రభుత్వం తగిన భద్రతా చర్యలు చేపట్టాలని కోరారు.ఎఫ్ఐఆర్ నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేయాలిదాడికి పాల్పడిన వ్యక్తులపై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ట్రెసా డిమాండ్ చేసింది. అలాగే ఫీల్డ్ విధులు నిర్వహించే రెవెన్యూ సిబ్బందికి భద్రత కల్పించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని కోరింది.ఉద్యోగుల భద్రతకు ప్రభుత్వం హామీ ఇవ్వాలిప్రభుత్వ ఉద్యోగుల గౌరవం, భద్రత, విధి నిర్వహణకు అవసరమైన రక్షణ కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని ట్రెసా పేర్కొంది. ఉద్యోగులపై దాడులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించకూడదని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా రెవెన్యూ సిబ్బందిలో భద్రతా భావన పెంపొందుతుందని సంఘం అభిప్రాయపడిందిఈ మేరకు జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్‌కు వినతిపత్రం అందజేసినట్లు ట్రెసా రాష్ట్ర జనరల్ సెక్రటరీ గౌతమ్ కుమార్, జిల్లా అధ్యక్షుడు ఎస్. జనార్ధన్ రావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తదితరులు తెలిపారు.



## నిర్ణీత ధరల కన్నా అధిక ధరలు వసూలు చేస్తున్న హెచ్.పీ గ్యాస్ ఏజెన్సీ బిల్ రిసిప్ట్ ఇవ్వరు.. తూకం వెయ్యరు

**కేవైసీ చేస్తే 250 నగదు వసూలు**
**అధికారులకు కంప్లీట్ చేస్తే పట్టించే కరువు.**

సింగరేణి/ఖమ్మం జూన్ 20 ప్రభాత సూర్యుడు హెచ్.పీ గ్యాస్ ఏజెన్సీ వారు ఖమ్మం జిల్లా, సింగరేణి మండలంలో వినియోగదారుల నుండి అధిక చార్జీలు వసూలు చేస్తున్నారని పలువురు వినియోగదారులు తెలిపారు. భద్రాద్రి జిల్లా పరిధిలోని హెచ్.పీ గ్యాస్ ఖమ్మం జిల్లా సింగరేణి మండలంలో అమ్మకాలు చేపడుతూ గ్యాస్ ధర కన్నా అధికంగా వినియోగదారుల నుండి డ్రైవర్స్, డెలివరీ బాయ్ ఒక్క బండపై 1100 రూపాయలు వసూలకు పాల్పడుతున్నారు. హెచ్.పీ గ్యాస్ వినియోగదారుల బుక్ లో కనీసం నగదు ఎంట్రీ చేయడం లేదు అని, బిల్ రిసిప్ట్ ఇవ్వడంలేదని, బండ తూకం వేయకుండానే వినియోగదారులకు అందించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత అధికారులు హెచ్పి గ్యాస్ పై తనిఖీలు లేకపోవడంతో ఇష్టానుసారంగా పల్లెల్లో నివసించే వినియోగదారుల నుంచి అధిక ధర వసూలు వసూలు చేసుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. ఉన్న బండ ధర ఒకటైతే అధికంగా వసూలు చేయడం ఏమిటని పలువురు అడగగా 10,20 రూపాయలు తగ్గించి ఇవ్వడం జరుగుతుంది. జిల్లా కలెక్టర్ ఇలాంటి అమ్మకాలు నిర్వహించే ఏజెన్సీ పై తనిఖీలు చేపడితేనే పేదలకు లాభసాటిగా మారుతుంది. గ్యాస్ అధిక ధర వస్తువులపై జిల్లా అధికారులకు చారవాణిలో వినియోగదారులు గ్యాస్ ధరలు నిర్ణీత ధరల వసూలు చేయాలని కోరారని తెలిపారు. హెచ్.పీ గ్యాస్ అధిక ధరలపై జిల్లా అధికారి వీరయ్యని వివరణ కోరగా ఏజెన్సీతో మాట్లాడడం జరుగుతుందని తెలిపారు.



## డెంగ్యూ కేసు బాధిత నివాస ప్రాంతాన్ని సందర్శించిన డిపిఓ.

సింగరేణి జూన్ 20 ప్రభాత సూర్యుడుకారేపల్లి లో డెంగ్యూ కేసు వెలుగు చూడటంతో పంచాయతీ రాజ్, వైద్యశాఖ అప్రమత్తమైంది. శనివారం జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు కారేపల్లి లో పర్యటించారు. డెంగ్యూ కేసు బాధితుల నివాస ప్రాంతాలను సందర్శించి పారిశుద్ధ్యం ను పరిశీలించారు. డెంగ్యూ వ్యాప్తి నివారణకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. అలాగే బాధితుల కుటుంబ సభ్యులు, పరిసర ప్రాంత ప్రజలకు పరిశుభ్రత, దోమల నివారణపై అవగాహన కల్పించారు. అనంతరం మండల పరిధిలోని కేజీబీవీ పాఠశాలను సందర్శించి పాఠశాల పారిశుద్ధ్య నిర్వహణ, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం అమలును తనిఖీ చేశారు. పారిశుద్ధ్యం విషయంలో నిర్లక్ష్యం వహించకుండా తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీడీవో రవీంద్ర ప్రసాద్, దుగ్గిరాల జయరాజు, సింగరేణి సర్పంచ్ మేదరి ఝాన్సీ సౌజన్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



# సూర్య తండాలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా

**ఆలయ నిర్మాణానికి రూ.51 వేల విరాళం అందజేసిన ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి**

ప్రభాత సూర్యుడు /వరంగల్ :రాయపర్తి, జూన్ 20: వరంగల్ జిల్లా రాయపర్తి మండలం సూర్య తండా గ్రామంలో నిర్వహించిన శ్రీ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన, దుర్గమ్మ పండుగ, బొడ్రాయి పండుగ ఉత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగాయి. రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.స్థానిక ఉత్సవ కమిటీ ఆహ్వానం మేరకు ఉత్సవాలకు హాజరైన శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆలయ నిర్మాణ పనుల కోసం ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.51 వేల విరాళాన్ని అందజేశారు. గ్రామాల్లో ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలకు తమ వంతు సహకారం ఎల్లప్పుడూ కొనసాగుతుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజల ఐక్యతకు, సాంప్రదాయాల పరిరక్షణకు ఇటువంటి వేడుకలు దోహదపడతాయని పలువురు అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో రాయపర్తి మండల బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు మునవత్ నర్సింహా నాయక్, మాజీ ఎంపీపీ జినుగు అనిమి రెడ్డి, మాజీ జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, రాష్ట్ర ఎస్టీ యూనియన్ ఉపాధ్యక్షుడు సురేందర్ రాథోడ్‌తో పాటు గుగులోత్ జాజు నాయక్, లేతకుల రంగా రెడ్డి, లేతకుల మధుకర్ రెడ్డి, తాళ్లపెల్లి సంతోష్ గౌడ్, చందు రామ్, గాదె రవీందర్ రెడ్డి, సంధి దేవేందర్ రెడ్డి, పెరటి యాదవ రెడ్డి, మునవత్ నారాయణ, చందు లక్ష్మన్, విజయ్, మునవత్ శంకర్, మునవత్ శ్రీనివాస్ తదితర నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# వేలేరు ప్రభుత్వ పాఠశాలలో ప్రీ-ప్రైమరీ తరగతి ప్రారంభం

ప్రభాత సూర్యుడు / :వేలేరు, జూన్ 20: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ మంజూరు చేసిన ప్రీ-ప్రైమరీ తరగతిని వేలేరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వేలేరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు బిల్లా యాదగిరి, మండల విద్యాధికారి (ఎంఈవో) చంద్రమౌగిళి హాజరై ప్రీ-ప్రైమరీ తరగతిని ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ బిల్లా యాదగిరి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి సహకారంతో వేలేరు గ్రామానికి ప్రీ-ప్రైమరీ తరగతి మంజూరు కావడం ఆనందదాయకమని పేర్కొన్నారు. గ్రామంలోని పాఠశాలల అభివృద్ధికి తమవంతు కృషి కొనసాగుతుందని, ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు సూచించారు.కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీకర్, ప్రధానోపాధ్యాయురాలు లీలా బాయ్, హైస్కూల్ హెచ్ఎం సత్యం, గ్రామపంచాయతీ కార్యదర్శి విజయ, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.ప్రీ-ప్రైమరీ తరగతి ప్రారంభంతో చిన్నారులకు ప్రాథమిక స్థాయి నుంచే నాణ్యమైన విద్య అందే అవకాశాలు మరింత మెరుగుపడనున్నాయని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.




# ఫేస్‌బుక్‌లో పార్ట్‌టైమ్ ఉద్యోగం పేరుతో సైబర్ మోసం

**రూ.67 వేలకుపైగా నష్టపోయిన యువకుడు**

ప్రభాత సూర్యుడు వరంగల్, జూన్ 20: వరంగల్ నగరంలోని డాక్టర్స్ కాలనీ-2, స్నేహనగర్ ప్రాంతానికి చెందిన నాయిని సాయి తేజ (26) అనే ప్రైవేట్ ఉద్యోగి సైబర్ మోసగాళ్ల బారిన పడి రూ.67 వేలకుపైగా నష్టపోయాడు. ఈ మేరకు ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, సాయి తేజ ఫేస్‌బుక్‌లో పార్ట్‌టైమ్ ఉద్యోగాల కోసం వెతుకుతున్న సమయంలో ఒక అప్లికేషన్ కనిపించడంతో దానిని డౌన్‌లోడ్ చేసుకుని తన వ్యక్తిగత వివరాలను నమోదు చేశాడు. అనంతరం ఆ యాప్‌లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని చూపించడంతో నమ్మిన బాధితుడు మొదటగా ఫోన్‌పే ద్వారా మోసగాళ్లు పంపినఞ= కోడ్‌కు రూ.50,000 బదిలీ చేశాడు. తర్వాత మరో రూ.14,000తో పాటు రూ.2,994.98లను కూడా పెట్టుబడి పేరుతో చెల్లించాడు.కొంతకాలం తర్వాత తాను పెట్టిన పెట్టుబడి తిరిగి రాకపోవడంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు. దీనికి సంబంధించి 33707250032719 అంగీకార (Acknowledgement) నంబర్ జారీ అయింది. మొత్తం రూ.67,004.98 నష్టపోయినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు.ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: పోలీసులుఈ సందర్భంగా వరంగల్ పోలీసులు ప్రజలకు పలు సూచనలు చేశారు. సోషల్ మీడియా, ఫేస్‌బుక్, వాట్సాప్, టెలిగ్రామ్ తదితర వేదికల ద్వారా వచ్చే పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, ఆన్‌లైన్ టాస్కులు, పెట్టుబడులపై అధిక లాభాలు వస్తాయని చెప్పే ప్రకటనలను నమ్మి డబ్బులు పెట్టుబడి పెట్టవద్దని హెచ్చరించారు.అపరిచితులు పంపిన లింకులు, యాప్‌లు డౌన్‌లోడ్ చేయడం,ఞ= కోడ్‌లు స్కాన్ చేసి నగదు బదిలీ చేయడం వంటి చర్యల విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని లేదా జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని తెలిపారు.సకాలంలో ఫిర్యాదు చేస్తే మోసపోయిన నగదును నిలిపివేసి తిరిగి పొందే అవకాశాలు మెరుగ్గా ఉంటాయని పోలీసులు పేర్కొన్నారు. వ్యక్తిగత బ్యాంకు ఖాతా వివరాలు, OTP\T, UPI PINలు ఇతరులతో ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దని, సైబర్ నేరాల పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



# ముఖ్యమంత్రి డైరెక్షన్ లో వేల కోట్ల దోపిడీ

**- సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్ ముంపు పేరుతో 70 కిలోమీటర్ల మేర ఇసుక తవ్వకాలు**
**- ఉమ్మడి వరంగల్ జిల్లాను ఆగం చేశారు..ఏ రంగంలోనూ అభివృద్ధి లేదు**
**- పవన్ కళ్యాణ్ ను ఎంటర్ టైన్ మెంట్ ఫ్యాక్టర్ గా తప్ప పొలిటికల్ ఫ్యాక్టర్ గా చూడొద్దు**
**- సినిమా యాక్టర్ల ముసుగులో వచ్చి మన భాషను, ప్రాంతాన్ని అవమానించింది వాళ్లే**
**- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత**
**- హన్మకొండలో పార్టీ ఆఫీస్ ప్రారంభోత్సవం**

ప్రభాత సూర్యుడు /వరంగల్ ముఖ్యమంత్రి డైరెక్షన్లో వేల కోట్ల దోపిడీ జరుగుతుందని తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలో జిల్లా టిఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ వరంగల్, హన్మకొండ, కాజీపేట ట్రై సిటీలకు తెలంగాణ వచ్చాక ఒక్క కొత్త చెప్పుకోదగ్గ విద్యా సంస్థ రాలేదు.విద్య, వైద్యం, ఉద్యోగాలు, ఉపాధి కల్పన విషయంలో తెలంగాణకు ఏం మంచి జరగలేదు.ఉన్న ఒక్క జిల్లాను అనేక జిల్లాలుగా చేసి అవినీతికి పాల్పడ్డారు అన్నారు.ముఖ్యమంత్రి వచ్చి 5, 200 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ చేస్తామని చెప్పారు. కానీ దానికి ఇప్పటికీ మాస్టర్ ప్లాన్ లేదు. రాష్ట్రంలో ఉన్న రాజకీయా పార్టీలపై అసహనంగా ఉన్నారు.అందుకే ప్రజలు ఒక కొత్త రాజకీయ ప్రత్యామ్నాయం కావాలని కోరుకుంటున్నారు.తమ పాంచజన్యం పేరుతో ఐదు కీలక అంశాలను ప్రాధాన్యంగా పెట్టుకున్నాం.విద్య, వైద్యం కోసం ప్రజల జేబు నుంచి ఒక్క రూపాయి కూడా ఖర్చు కావద్దు. సామాజిక న్యాయం జరగాలి, యువతి, యువకులకు ఉపాధి కల్పన కోసం మేము కృషి చేస్తాం అన్నారు. కాంగ్రెస్ నాయకులు ఏనుమాముల మార్కెట్ కు వస్తే రైతులు తన్ని తరిమేస్తారు అని అన్నారు.కాకతీయ యూనివర్సిటీలో హాస్టల్ లేక విద్యార్థులు బయట ఉండి చదువుకోవాల్సిన పరిస్థితి ఉంది. వెంటనే హాస్టల్ భవనాన్ని ఏర్పాటు చేయాలి. యూనివర్సిటీ రిక్రూట్ మెంట్లు లేవు. వెంటనే రిక్రూట్ మెంట్లు చేపట్టాలి.టెక్స్ టైల్ పార్క్ కోసం కేటాయించిన 2400 ఎకరాలను లే అవుట్ చేస్తూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలని చూస్తున్నారు అన్నారు.ముఖ్యమంత్రి ఆఫీస్ నుంచి వచ్చిన డైరెక్షన్ లో మంత్రులు పొంగులేటి, సీతక్క దోపిడీని కొనసాగిస్తున్నారు. సీతమ్మ సాగర్ బ్యాక్ వాటర్ నుంచి 70 కిలోమీటర్ల మేర ఇసుక దోపిడీ చేస్తున్నారు. దీని కారణంగా గోదావరికి గర్భశోకం మిగులుతోంది. ఆదివాసీలు ఎన్జీటీలో కేసు వేసిన పట్టించుకోవటం లేదు. పవన్ కళ్యాణ్ విషయంలో తెలంగాణ యువత జాగ్రత్తగా ఉండాలి. సినిమా యాక్టర్ల ముసుగులో వాళ్లు మన మీద ఆధిపత్యం కోసం వస్తారు. గతంలో కూడా ఇలాగే వచ్చి మన భాష బాగాలేదంటూ మనల్ని అవమానించారు. తెలంగాణ యాసను సినిమాల్లో రౌడీలకు పెట్టి మనల్ని అవమానించారు. ఆ అవమానాలను మా తరం వాళ్లు ఎదుర్కొన్నాం. వారి ఆధిపత్య ధోరణికి వ్యతిరేకంగా పోరాటం చేశాం. ఇప్పుడున్న యువతకు తెలంగాణ పోరాటం గురించి తెలియకపోవచ్చు. మన ప్రాంతాన్ని అవమానించి వారిపైనే మనం పోరాటం చేశాం. యువత చరిత్ర తెలుసుకోవాలి.పవన్ కళ్యాణ్ సినిమాలు చేసుకోవచ్చు. ఆయన డ్యాన్స్ లు చూసి మనం ఎంజాయ్ చేద్దాం అంతేకానీ ఇక్కడి రాజకీయాల్లో జోక్యం చేసుకుంటాం అంటే ఊరుకునేది లేదు అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు భానోత్ వెంకన్న, ఉమ్మడి జిల్లా ఇంచార్జ్ నడిపెల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# హనుమకొండలో పేదల ఇళ్ళు కూల్చివేత దుర్మార్గం

**- గుండ్ల సింగారం బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాడుతాం**
**- ఇండ్ల పట్టాల సాధనకు రాష్ట్ర వ్యాప్తంగా ఐక్య పోరాటాలు**
**- హైదరాబాద్ లో ఇండ్ల స్థలాల సాధనకై అఖిలపక్ష సమావేశం**
**- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**

ప్రభాత సూర్యుడు/వరంగల్ హనుమకొండ గుండ్ల సింగారంలో పేదల ఇళ్ళు కూల్చి వేయడం దుర్మార్గమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం గుండ్ల సింగారంలో పేదల ఇళ్ళు కూల్చివేత విషయం తెలుసుకున్న కూనంనేని సాంబశివరావు హుటా హుటిన హైదరాబాద్ నుండి హనుమకొండకు చేరుకొని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు,జిల్లా సిపిఐ నాయకులతో కలిసి గుండ్ల సింగారంలో కూల్చి వేసిన గుడిసెలను సందర్శించారు. ఈ సందర్భంగా గుడిసె వాసులు సిపిఐ నాయకులకు తమ గోడు వెళ్లబోసుకుని, చిన్న పిల్లలు, మహిళలు అని చూడకుండా తమను తమ ఇండ్ల నుండి ఈడ్చి పడేశారని తెలిపారు. అలాగే బియ్యం, ఇతర నిత్యావసరాలను రోడ్డు పాలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.కాగా విద్యార్థుల సర్టిఫికేట్ లను సైతం తీసుకోనివ్వకుండా పోలీసులు ఈడ్చుకొని వెళ్లారని విద్యార్థులు తెలిపారు. అనంతరం కూనంనేని సాంబశివరావు మీడియాతో మాట్లాడుతూ హనుమకొండ గుండ్ల సింగారంలో ఇండ్లు కోల్పోయిన పేదలకు న్యాయం జరిగే వరకూ తాము అండగా ఉంటామని అన్నారు. భూకబ్జాదారులు ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నా స్పందించని అధికారిక యంత్రాంగం నిలువ నీడ లేని పేదలు 50 గజాల స్థలంలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న వారిపై అర్ధరాత్రివేళ దొంగల మాదిరిగా దాడి చేయడం దుర్మమార్గమైన చర్య అన్నారు. హనుమకొండ, వరంగల్ జిల్లాలలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా గుడిసెలు వేసుకున్న పేదల పై ప్రతాపం చూపుతున్నారని, దీనిపై ముఖ్యమంత్రి స్పందించి ఇలాంటి దుశ్చర్యలను నిలుపుదల చేయాలని, నిలుపుదల చేయని ఎడల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని అన్నారు. ఇలాంటి దుశ్చర్యలను నిలుపుదల చేయకుంటే హనుమకొండ, వరంగల్ జిల్లాల నుండే రాష్ట్ర వ్యాప్తంగా పేదల ఇళ్ళ స్థలాల పోరాటం ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.తాము ప్రభుత్వానికి మిత్ర పక్షంగా ఉన్నప్పటికీ పేదల కోసం ఇలాంటి ప్రజా వ్యతిరేక చర్యలను ఎండగడుతామని హెచ్చరించారు.వామపక్షాల ఆధ్వర్యంలో పేదల ఇళ్ళు, ఇండ్ల స్థలాలు, భూ సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా ఐక్య పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. దీనిపై ఆదివారం హైదరాబాద్ లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మక్దూం భవన్ లో అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర వ్యాప్తంగా భూ సమస్యలపై ఒక భవిష్యత్తు కార్యాచరణను రూపొందించుకుని ముందుకు సాగుతామని చెప్పారు. ఈ సందర్భంగా గుండ్ల సింగారంలో ఇండ్ల కూల్చివేతకు గురైన బాధితులతో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ పేదలందరూ ఐక్యంగా నిలబడాలని, సిపిఐ పూర్తిగా అండగా ఉంటుందని చెప్పారు. ఇండ్ల పట్టాలు సాధించే వరకూ విశ్రమించేదిలేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, సిపిఎం జిల్లా కార్యదర్శి గాదె ప్రభాకర్ రెడ్డి, సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాషుమియా, సిపిఐ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు అదరి శ్రీనివాస్, మేకల రవి, మంద సదాలక్ష్మి, వలీ ఉల్లాఖాద్రి, హనుమకొండ మండల కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్, సిపిఎం తదితరులు పాల్గొన్నారు.



# వర్షాకాల సవాళ్లకు నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ సిద్ధం

**24 గంటల కంట్రోల్ రూమ్ ఏర్పాటు.. 150 మందితో ప్రత్యేక మాన్సూన్ బృందాలు**

ప్రభాత సూర్యుడు/నల్లగొండ, జూన్ 20 : వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు నల్లగొండ మున్సిపల్ కమిషనర్ బి. శరత్ చంద్ర తెలిపారు. భారీ వర్షాలు, నీటి నిల్వలు, డ్రైనేజీల పొంగిపొర్లడం, చెట్లు కూలిపోవడం, రోడ్ల దెబ్బతినడం, తాగునీటి సరఫరా అంతరాయాలు వంటి సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తోందన్నారు.మేయర్ ఆదేశాలు, కమిషనర్ ప్రత్యక్ష పర్యవేక్షణలో నగరాన్ని టౌన్-1, టౌన్-2 ప్రాంతాలుగా విభజించి ప్రత్యేక రెస్క్యూ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వార్డు అధికారులు, శానిటరీ సిబ్బంది, వాటర్ సప్లై విభాగం, ఎలక్ట్రిషియన్లు, హరితహారం, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, శానిటేషన్ విభాగాల సిబ్బందితో కలిపి 150 మందికి పైగా ఉద్యోగులు 24 గంటలూ అందుబాటులో ఉండనున్నారని పేర్కొన్నారు.ప్రజల ఫిర్యాదులను స్వీకరించి తక్షణమే పరిష్కరించేందుకు 08682-220100 నంబర్‌తో 24 గంటల కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మూడు షిఫ్టుల్లో సిబ్బంది విధులు నిర్వహిస్తూ అత్యవసర పరిస్థితుల్లో స్పందించనున్నారని తెలిపారు.నగరంలోని ప్రధాన డ్రైన్లు, వర్షపు నీటి కాలువలు, కల్వర్టులు, లోతట్టు ప్రాంతాల్లో డీసిల్టింగ్ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని, నీటి నిల్వలు ఏర్పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ చెప్పారు. అలాగే డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధుల నివారణ కోసం అన్ని డివిజన్లలో ప్రతిరోజూ ఫాగింగ్, యాంటీ లార్వా స్ప్రేయింగ్, పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.భారీ వర్షాల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరం కాకపోతే బయటకు రావద్దని సూచించారు. ఇంటి చెత్తను డ్రైనేజీలు, కాలువలు, రోడ్లపై వేయకుండా మున్సిపల్ వాహనాలకు మాత్రమే అందించాలని కోరారు. డ్రైనేజీల్లో చెత్త వేయడం వల్ల నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి వరద పరిస్థితులు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు.చెట్లు కూలిపోవడం, డ్రైనేజీలు మూసుకుపోవడం, నీటి నిల్వలు ఏర్పడటం, తాగునీటి సరఫరా సమస్యలు, వీధి దీపాల లోపాలు, రోడ్లు దెబ్బతినడం లేదా ప్రమాదకర భవనాల పరిస్థితులు గమనించిన వెంటనే మున్సిపల్ కార్పొరేషన్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలని కమిషనర్ బి. శరత్ చంద్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు."ప్రజల భద్రతే మా ప్రథమ ప్రాధాన్యత. అత్యవసర పరిస్థితుల్లో ప్రతి నిమిషం విలువైనది. ప్రజలు అప్రమత్తంగా ఉండి మున్సిపల్ కార్పొరేషన్‌కు సహకరించాలి" అని కమిషనర్ పేర్కొన్నారు.





## 'ధురంధర్' స్టాటిస్టిక్స్ పాఠాలు: IIM అహ్మదాబాద్ ప్రొఫెసర్ క్రియేటివిటీకి ఇంటర్నెట్ ఫిదా!

ఐఐఎం అహ్మదాబాద్‌కు చెందిన ఒక ప్రొఫెసర్ విద్యార్థులకు క్లిష్టమైన స్టాటిస్టిక్స్ (గణాంక శాస్త్రం) సబ్జెక్టును వివరించడానికి బ్లాక్‌బస్టర్ సినిమా -ధురంధర్-లోని సన్నివేశాలను ఉపయోగించారు. ప్రతిష్ఠాత్మక ఐఐఎంలో స్టడీ అంటే ప్రతిదీ ప్రాక్టికల్‌గా విద్యార్థులకు అర్థమయ్యే విధానంలో భోధిస్తారనే ప్రత్యేక గుర్తింపు ఉంటుంది. దేశంలోని బెస్ట్ బిజినెస్ స్కూల్స్ లో ఒకటైన ఐఐఎం- అహ్మదాబాద్ లో ఒక గురువుగారు అనుసరించిన వినూత్న టీచింగ్ మెథడ్ అందరి దృష్టిని ఆకర్షించింది. క్లిష్టమైన సబ్జెక్టులను కూడా



కాస్త సృజనాత్మకతను జోడిస్తే ఎంత సరదాగా మార్చవచ్చో ఈ ఘటన నిరూపించింది. ఐఐఎం అహ్మదాబాద్‌కు చెందిన ఒక ప్రొఫెసర్ విద్యార్థులకు క్లిష్టమైన స్టాటిస్టిక్స్ (గణాంక శాస్త్రం) సబ్జెక్టును వివరించడానికి బ్లాక్‌బస్టర్ సినిమా -ధురంధర్-లోని సన్నివేశాలను ఉపయోగించారు. దీనికి సంబంధించిన ఒక వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా వైరల్ అవుతోంది. ఈ ఆసక్తికర వీడియోను ఐఐఎం అహ్మదాబాద్ విద్యార్థి ప్రఖర్ సింగ్ తన ఇన్‌స్టా ఖాతాలో షేర్ చేసారు. అందులో క్లాస్‌రూమ్‌లోని పెద్ద స్క్రీన్‌పై విద్యార్థులంతా -ధురంధర్- సినిమా సీన్‌ను ఆసక్తిగా వీక్షించడం కనిపిస్తుంది. ఆ వెంటనే ప్రొఫెసర్ రంగంలోకి దిగి.. ఆ సన్నివేశాన్ని ఉదహరిస్తూ స్టాటిస్టిక్స్‌లోని అడ్వాన్స్‌డ్ కాన్సెప్ట్‌లను విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించారు. ఈ అనుభవాన్ని ప్రఖర్ సింగ్ షేర్ చేస్తూ.. --ఐఐఎం అహ్మదాబాద్‌లో మాత్రమే ఒక ధురంధర్ సీన్ స్టాటిస్టిక్స్ పాఠంగా మారుతుంది. -విన్ ల్యారీ, విన్ పాకిస్తాన్- అనే డైలాగ్‌ను క్లస్టర్ శాంప్లింగ్‌కు.. --బలోచ్ ముఠాలు, పఠాన్ ముఠాలు ప్రాథమికంగా భిన్నమైన సమూహాలు-- అనే అంశాన్ని స్ట్రాటిఫికేషన్‌కు లింక్ చేస్తూ ప్రొఫెసర్ బోధించారు. ఒక నిమిషం మీరు గ్యాంగ్ వార్ చూస్తుంటే... మరుసటి నిమిషంలో సర్వే డిజైన్, రీసెర్చ్ మెథడాలజీ గురించి చర్చిస్తుంటారు!-- అంటూ క్యాప్షన్ పెట్టారు.ఈ వినూత్న బోధనా శైలికి నెటిజనులు ఫిదా అయిపోయారు. సదరు ప్రొఫెసర్ చాతుర్యాన్ని, సృజనాత్మకతను కామెంట్ల రూపంలో విపరీతంగా కొనియాడారు. --ఈ ప్రొఫెసర్ ఆలోచనా స్థాయి వేరే లెవెల్. క్లిష్టమైన స్టాటిస్టిక్స్‌ను కూడా చాలా సరళంగా.. మనకు రిలేట్ అయ్యేలా మార్చేశారు. కోర్సును ఇంత వేగంగా అప్‌డేట్ చేయడం ఆయనకే సాధ్యం-- అని ఒక నెటిజన్ ప్రశంసించగా.. అమెరికా వంటి దేశాల్లో ప్రొఫెసర్లు ఇలా సినిమాలను వాడుతూ పాఠాలు చెప్పడం సర్వసాధారణమని... భారతదేశంలో మాత్రం ఇలాంటి అధునాతన శైలి కేవలం కొన్ని ప్రతిష్ఠాత్మక ఐఐటీలు, ఐఐఎంల వంటి ఎలైట్ విద్యాసంస్థలకే పరిమితమైందని మరొకరు అభిప్రాయపడ్డారు.

## ఒకవైపు కోర్టు సమన్లు.. మరోవైపు చిన్నారి ఫ్యాన్‌పై అల్లు అర్జున్ మనసు!

ఒక వైపు సంధ్య థియేటర్ కేసులో కోర్టుకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు అల్లు అర్జున్. కోర్టు సమన్లు అందడంతో అతడు ఈనెల 22న విచారణకు హాజరు కావాల్సి ఉంది. మరోవైపు ఐకాన్ స్టార్ తన మంచి మనసును చాటుకునేందుకు ఉన్న ఏ ఒక్క అవకాశాన్ని వదులుకోవడం లేదు. ఒక వైపు సంధ్య థియేటర్ కేసులో కోర్టుకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు అల్లు అర్జున్. కోర్టు సమన్లు అందడంతో అతడు ఈనెల 22న విచారణకు హాజరు కావాల్సి ఉంది. మరోవైపు ఐకాన్ స్టార్ తన మంచి మనసును చాటుకునేందుకు ఉన్న ఏ ఒక్క



అవకాశాన్ని వదులుకోవడం లేదు. అతడు ఈరోజు తీవ్ర అనారోగ్యంతో ఉన్న ఒక చిన్నారిని పలకరించి.. పూర్తిగా కోలుకున్నాక తనను హైదరాబాద్ లో కలిసేందుకు రావాల్సిందిగా కోరారు. ఒక ఎన్జీవో చిన్నారిని బన్నికి పరిచయం చేసింది. బన్ని తన దాతృత్వాన్ని, మంచి మనసును చాటుకోవడానికి ఎప్పుడూ వెనకాడరు. ఈసారి కూడా చిన్నారి అనారోగ్యం గురించి తెలుసుకుని కలత చెందారు. అదే సమయంలో సంధ్య థియేటర్ కేసు విషయంలోను ఆయన ఎంతో డిగ్నిఫైడ్ గా వ్యవహరించడం అభిమానుల్లో చర్చకు వచ్చింది. సోషల్ మీడియాలో రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నా.. అన్నిటికీ అతీతంగా చట్టాన్ని గౌరవిస్తూ అల్లు అర్జున్ కచ్చితంగా కోర్టు ముందు హాజరవుతారని ..ఈ కేసులోని ప్రతి దశలోనూ న్యాయస్థానానికి పూర్తిగా సహకరిస్తారని ఆయన సన్నిహిత వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఏది ఎలా ఉన్నా.. తనను ప్రాణంగా అభిమానించే ఒక చిన్నారి కోసం అల్లు అర్జున్ ప్రత్యేక సమయాన్ని కేటాయించడం ఇప్పుడు చర్చకు వచ్చింది. వారి కలల్ని నిజం చేస్తూ.. టాలీవుడ్ స్టార్ హీరోల మానవత్వం: తెలుగు చిత్ర పరిశ్రమలోని అగ్ర హీరోలు కేవలం వెండితెరపైనే కాకుండా... నిజ జీవితంలోనూ తమకున్న పెద్ద మనసును చాటుకుంటూ ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తున్నారు. టాలీవుడ్‌లో పలువురు హీరోలు తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారి అభిమానులను ఆప్యాయంగా పలకరించి, వారి ముఖాల్లో నవ్వులు పూయించారు. మరికొన్ని అరుదైన సందర్భాలలో.. ప్రాణాంతక వ్యాధులతో మరణానికి చేరువగా ఉన్న చిన్నారుల చివరి కోరికలను మన్నించి... వారితో ఆత్మీయంగా కొంత సమయం గడిపిన సంఘటనలు కూడా ఉన్నాయి. తమ అభిమాన హీరోని కలవడమే పరమావధిగా భావించే ఆ చిన్నారుల జీవితాల్లో, ఈ స్టార్స్ చూపించే కాస్త ప్రేమ కొండంత ధైర్యాన్ని ఇస్తుంది. ఇలాంటి మానవీయ కోణంలో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, యంగ్ టైగర్ ఎన్టీఆర్, సూపర్ స్టార్ మహేష్ బాబు వంటి అగ్ర హీరోలు గతంలో పలుమార్లు తమ మంచి మనసును చాటుకున్నారు. ఆసుపత్రులలో మంచానికే పరిమితమైన చిన్నారులను ప్రత్యేకంగా కలిసి.. వారితో ముచ్చటించి... వారి కళ్లలో ఎనలేని ఆనందాన్ని నింపారు. షూటింగ్‌లతో ఎంత బిజీగా ఉన్నా స్వచ్ఛంద సంస్థల (ఎన్జీవోలు) ద్వారా తమకు తెలిసిన ఇలాంటి బాధాకరమైన విషయాలపై తక్షణమే స్పందిస్తూ.. ఆ చిన్నారుల కలలను మన స్టార్లు నిజం చేస్తున్నారు. కేవలం నటులుగానే కాకుండా సమాజం విషయలో బాధ్యత కలిగిన వ్యక్తులుగా మన స్టార్ హీరోలు చేస్తున్న ఇటువంటి పనులు అభిమానుల గుండెల్లో వారి స్థానాన్ని మరింత పదిలపరుస్తున్నాయి. అల్లు అర్జున్ ప్రస్తుతం అట్లీ దర్శకత్వంలో రాకా చిత్రీకరణలో పాల్గొంటున్న సంగతి తెలిసిందే

## సోదరికి ఎమోషనల్ విషెస్ తెలిపిన నిషా అగర్వాల్..



ఆ జ్ఞాపకాలను పంచుకుంటూ! ప్రముఖ హీరోయిన్ నిషా అగర్వాల్ గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. మోడల్ గా తన కెరీర్ మొదలుపెట్టిన నిషా అగర్వాల్ తెలుగు, మలయాళం, తమిళ చిత్రాలలో నటించి హీరోయిన్గా మంచి పేరు సొంతం చేసుకుంది. ప్రముఖ హీరోయిన్ నిషా అగర్వాల్ గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. మోడల్ గా తన కెరీర్ మొదలుపెట్టిన నిషా అగర్వాల్ తెలుగు, మలయాళం, తమిళ చిత్రాలలో నటించి హీరోయిన్గా మంచి పేరు సొంతం చేసుకుంది. అలా తొలిసారి 2017లో వచ్చిన ఏమైంది ఈవేళ అనే చిత్రం ద్వారా తెలుగు ప్రేక్షకులను పలకరించింది. ఇందులో అవంతిక పాత్రతో అందరి దృష్టిని ఆకట్టుకున్న ఈమె.. ఆ తర్వాత 2011లో సోలో అనే సినిమాలో నటించి ఆకట్టుకుంది. ఇక 2012లో ఇష్టం అనే సినిమా ద్వారా తమిళ సినీ రంగ ప్రవేశం చేసిన ఈమె.. మళ్లీ 2013లో సుకుమారుడు, సరదాగా అమ్మాయితో అనే చిత్రాలలో నటించింది. ఇక చివరిగా మలయాళంలో రెండు చిత్రాలు చేసి ఇండస్ట్రీకి దూరమయ్యింది. ప్రస్తుతం కుటుంబంతోనే సమయాన్ని గడిపేస్తూ పిల్లల ఆలనా పాలనా చూసుకుంటూ బిజీగా మారిన ఈమె మరొకవైపు తన సోదరి కాజల్ అగర్వాల్ ఫ్యామిలీతో నిత్యం ఎంజాయ్ చేస్తూ అందుకు సంబంధించిన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. ఇకపోతే కాజల్ పుట్టినరోజు కావడంతో తన సోదరికి ఒక ఎమోషనల్ విషెస్ తెలియజేసింది ఈ ముద్దుగుమ్మ. ఈ మేరకు కాజల్ అగర్వాల్ తో గడిపిన ప్రతి అద్భుతమైన క్షణాలకు సంబంధించిన ఫోటోలను అభిమానులతో పంచుకుంటూ ఇలా రాసుకొచ్చింది. "నా సోదరికి, నా ప్రాణ స్నేహితురాలికి నా జీవితంలో గొప్ప వ్యక్తులలో ఒకరైన మీకు పుట్టినరోజు శుభాకాంక్షలు. ప్రతి దశలో కూడా నాకు అండగా నిలిచావు. నాకు ఒక సురక్షితమైన ఆశ్రయాన్ని కల్పించావు. నన్ను అత్యధికంగా ప్రోత్సహిస్తూ నా మనసును అందరికంటే బాగా అర్థం చేసుకున్న వ్యక్తివి నువ్వే. నీ ప్రేమకు , నీ దయకు, నీ బలానికి అడుగడుగునా ఎల్లప్పుడూ నాకు తోడుగా ఉన్నందుకు ధన్యవాదాలు. ముఖ్యంగా నేను నిన్ను ఎంతగా ప్రేమిస్తున్నానో నీకు ఎప్పటికీ తెలియదు" అంటూ తన అక్క కాజల్ అగర్వాల్ ను ట్యాగ్ చేస్తూ ఒక ఎమోషనల్ పోస్ట్ పంచుకుంది నిషా అగర్వాల్ . ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. కాజల్ అగర్వాల్ విషయానికి వస్తే.. లక్ష్మీ కళ్యాణం అనే సినిమా ద్వారా తెలుగు తెరకు పరిచయమైన ఈ ముద్దుగుమ్మ చందమామ సినిమాతో ఊహించని పాపులారిటీ అందుకుంది. అటు మగధీర సినిమాతో పాన్ ఇండియా స్టార్ గా అవతరించిన కాజల్ అగర్వాల్ వరుస పెట్టి అవకాశాలు అందుకుంటూ మంచి పేరు దక్కించుకుంది. ఇక వివాహం తర్వాత ఒక కొడుకుకు జన్మనిచ్చిన ఈమె కొంతకాలం ఇండస్ట్రీకి గ్యాప్ తీసుకొని మళ్ళీ సెకండ్ ఇన్నింగ్స్ లో వరుస అవకాశాలు అందుకుంటుంది. ఇకపోతే ఈమె గోపీచంద్ మలినేని దర్శకత్వంలో బాలకృష్ణ హీరోగా నటిస్తున్న ఎన్బికె 111 సినిమాలో అవకాశాన్ని అందుకుంది.

## 'ఓజి 2' ఫిక్స్ ఓకే.. మరి ఆ విషయం పై క్లారిటీ ఎప్పుడు..?

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హోమ్ బ్యానర్ 'పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్' ఇటీవల 'ఓజీ 2' పై ఇచ్చిన స్టేట్‌మెంట్‌తో ఫ్యాన్స్ ఫుల్ ఖుషీలో ఉన్నారు. ప్రస్తుతం లండన్‌లో ఉన్న డైరెక్టర్ సుజిత్.. ఇండియాకు తిరిగి రాగానే పవన్‌తో భేటీ కానున్నారు. ఈ మీటింగ్‌లోనే స్క్రిప్ట్, బడ్జెట్, రెమ్యునరేషన్లపై కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు.?అయితే, మొదటి భాగాన్ని నిర్మించిన డి.వి.వి.



దానయ్య సీక్వెల్‌పై అంతగా ఆసక్తి చూపించడం లేదు. దీంతో పవన్ కళ్యాణ్ సొంత బ్యానర్ ఈ చిత్ర నిర్మాణంలో భాగస్వామి కానుంది. దీనికోసం టాలీవుడ్‌కి చెందిన ఒక టాప్ ప్రొడక్షన్ హౌస్‌తో చేతులు కలపాలని ప్లాన్ చేస్తున్నాడు.?ప్రస్తుతం సుజిత్ 'యువీ క్రియేషన్స్'తో కూడా చర్చలు జరుపుతున్నాడు. మరోవైపు పవన్ కళ్యాణ్‌కు కమిట్‌మెంట్స్ ఉన్న పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, మైత్రీ మూవీ మేకర్స్ లేదా రామ్ తాళ్లూరిలలో ఎవరో ఒకరు 'ఓజీ 2' ప్రొడక్షన్‌లోకి వచ్చే ఛాన్స్ ఉంది. ఈ క్రేజీ సీక్వెల్ ప్రొడ్యూసర్‌పై రాబోయే రెండు నెలల్లో పూర్తి క్లారిటీ రానుంది.


## 'పెద్ది'కి ఇదే లాస్ట్ ఛాన్స్!?



మెగాపవర్ స్టార్ రామ్ రామ్ చరణ్ హీరోగా జాన్వి కపూర్ హీరోయిన్గా దర్శకుడు బుచ్చిబాబు తలకెక్కించిన ఎమోషనల్ స్పోర్ట్స్ డ్రామా చిత్రమే పెద్ది. ఈ జూన్ నెలలో మొదటి పెద్ద సినిమాగా థియేటర్స్ లో రిలీజ్ కు వచ్చిన ఈ సినిమా టాలీవుడ్ లో చాలా కాలం ఎదురు చూస్తున్న పెద్ద హిట్ గా నిలిచింది. అయితే ఈ సినిమా తర్వాత చెప్పుకో దగిన రేంజ్ సినిమాలు కొత్తగా ఈ రెండు వారాలుగా లేవు.దీంతో పెద్ది సినిమా ఈ రెండు వారాలు మంచి వసూళ్లు రాబట్టేసింది ఇలా మూడో వారంతంలోకి ఎంటర్ అయిన సినిమా చివరి అవకాశానికి వచ్చిందని చెప్పొచ్చు. ఈ వారంలో సమంత నటించిన మా ఇంటి బంగారం ఇతర కొన్ని సినిమాలు విడుదలయ్యాయి. వీటిలో సమంత సినిమాకి అలాగే అనే మలయాళం సినిమాకి మంచి మౌత్ టాక్ లభించింది.సో ఇవి కొత్త సినిమాలు కాబట్టి ఈ వీకెండ్ కీలకమని చెప్పొచ్చు అలాగే ఈ వారాంతంలో వచ్చే వసూళు దాదాపుగా ఫైనల్ క్లోసింగ్ అనుకోవచ్చు. సో పెద్ద సినిమా ఎక్కడ వరకు వెళ్లి అవుతుందో చూడాలి.

## యష్ 'టాక్సిక్'.. ఆ విషయంలో ఫెయిల్ అయ్యారా?

రాకింగ్ స్టార్ యష్ పేరు వినగానే ప్రేక్షకులకు ముందుగా గుర్తుకు వచ్చేది కేజీఎఫ్ సిరీస్. ఆ సినిమాలతో ఆయన పాన్ ఇండియా స్టార్ గా క్రేజ్ సొంతం చేసుకున్నారు. రాకింగ్ స్టార్ యష్ పేరు వినగానే ప్రేక్షకులకు ముందుగా గుర్తుకు వచ్చేది కేజీఎఫ్ సిరీస్. ఆ సినిమాలతో ఆయన పాన్ ఇండియా స్టార్ గా క్రేజ్ సొంతం చేసుకున్నారు. అందుకే ఆయన నుంచి వచ్చే ప్రతి కొత్త ప్రాజెక్టుపై భారీ అంచనాలు ఉంటాయి. ప్రస్తుతం యష్ హీరోగా తెరకెక్కుతున్న టాక్సిక్ కూడా అలాంటి అంచనాల మధ్య రూపుదిద్దుకుంటోంది. అయితే సినిమా రిలీజ్ డేట్ పై క్లారిటీ లేనప్పటికీ, ప్రస్తుతం సోషల్ మీడియాలో ఒక ఆసక్తికర చర్చ నడుస్తోంది. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న టాక్సిక్ ను కేవీఎన్ ప్రొడక్షన్స్ భారీ స్థాయిలో నిర్మిస్తోంది. యష్ సరసన రుక్మిణి వసంత్, తారా సుతారియా యాక్ట్ చేస్తున్నారు. అలాగే హ్యూమా ఖురేషి, కియారా అద్వానీ, నయనతార వంటి స్టార్ బ్యూటీలు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. భారీ బడ్జెట్, స్టార్ క్యాస్ట్, ఇంటర్నేషనల్ రేంజ్ ప్రొడక్షన్ వాల్యూస్ తో ఆ సినిమా మొదటి నుంచే హాట్ టాపిక్ గా మారింది. సినిమా ప్రకటించిన సమయంలో వచ్చిన పోస్టర్లు, కాన్సెప్ట్ వివరాలు అభిమానుల్లో మంచి ఆసక్తిని పెంచాయి. ముఖ్యంగా కేజీఎఫ్ తర్వాత యష్ ఎలాంటి కథను ఎంచుకున్నారనే విషయంపై నేషనల్ వైడ్ గా చర్చ జరిగింది. దీంతో టాక్సిక్ పై మొదటి నుంచే మంచి బజ్ ఏర్పడింది. అయితే ఆ బజ్ ను మేకర్స్ ఎక్కువ కాలం కొనసాగించలేకపోయారనే అభిప్రాయం ఇప్పుడు కొందరిలో వ్యక్తమవుతోంది. సాధారణంగా భారీ పాన్ ఇండియా సినిమాలకు సంబంధించి తరచూ అప్డేట్లు, పోస్టర్లు, వీడియోలు లేదా షూటింగ్ విశేషాలు విడుదల చేస్తుంటారు. దీంతో సినిమా ప్రేక్షకుల దృష్టిలో కంటిన్యూగా ఉంటుంది. కానీ టాక్సిక్ విషయంలో అలాంటి ప్రమోషనల్ యాక్టివిటీ తక్కువగా కనిపించిందనే అభిప్రాయం సోషల్ మీడియాలో వినిపిస్తోంది. సినిమా గురించి కొత్త సమాచారం లేకపోవడం, విడుదల తేదీపై కూడా స్పష్టత లేకపోవడం వల్ల మొదట్లో ఉన్న హైప్



కొంత తగ్గిందని కొందరు నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.ముఖ్యంగా సోషల్ మీడియా యుగంలో ప్రేక్షకుల దృష్టిని నిలబెట్టుకోవడం చాలా కీలకంగా మారింది. వరుస అప్డేట్స్ లేకపోతే ఎంత పెద్ద స్టార్ సినిమా అయినా చర్చల నుంచి కొంతకాలం దూరమవుతుందని అభిప్రాయం వ్యక్తమవుతోంది. అదే ఇప్పుడు టాక్సిక్ విషయంలో జరిగిందని కొందరు సినీ ప్రియులు చెబుతున్నారు. అయితే మరికొందరు మాత్రం ఆ వాదనతో ఎగ్రీ అవ్వడం లేదు. పెద్ద సినిమాల విషయంలో మేకర్స్ కొన్నిసార్లు కావాలనే సైలెంట్ స్ట్రాటజీ ఫాలో అవుతారని వారు గుర్తు చేస్తున్నారు. సరైన సమయంలో టీజర్, ట్రైలర్ లేదా గ్లింప్స్ విడుదల చేస్తే మళ్లీ సినిమా ఒక్కసారిగా వార్తల్లోకి వస్తుందని అంటున్నారు. యష్ కు ఉన్న క్రేజ్ దృష్ట్యా ఒక్క అప్డేట్ వచ్చినా సినిమా మళ్లీ ట్రెండింగ్ లోకి వెళ్లే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు. ఏదేమైనా యష్ అభిమానులు కూడా సినిమా నుంచి కొత్త అప్డేట్ల కోసం ఎదురుచూస్తున్నారు. దీంతో రానున్న రోజుల్లో మేకర్స్ ప్రమోషన్ల స్పీడ్ పెంచుతారా? ప్రస్తుతం తగ్గినట్లు కనిపిస్తున్న బజ్ మళ్లీ పీక్ రేంజ్ కు తీసుకెళ్తారా? అన్నది ఆసక్తికరంగా మారింది.

Published & Owned by CHERUKU UPENDAR on behalf of HAMSA PUBLICATIONS,Pulblished at H.No:7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR,ABDULLAPURMET MANDAL,Hayanthnagar,Rangareddy District/Hyderabad City,Telangana-Pin:501505. Printed by RATNA GRAPHICS at H.No.2-3-703/7,Tirumala Nagar Colony,Police Lane,Amberpet, Hyderabad-500 013 Telangana.Editor: CHERUKU UPENDAR E-mail:prabhathasuryudueditor@gmail.com PRGI Reg No:TGTEL/25/A0555